సృజన విరిసె.. ఆలోచన మెరిసె

అలరించిన టెక్రియా 2కే24

నిట్, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

తాడేపల్లిగూడెంలోని నిట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న టెక్రియా 2కే24 కార్యక్రమాలు సందడిగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం నిర్వహించిన సాంకేతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ సృజనాత్మకతకు సాంకేతికతను జోడించి రూపొందించిన 18 రకాల గేమ్‌లు విశేషంగా అలరించాయి. వీటిలో కార్ రేసింగ్, కార్ సాకర్, ట్రెజర్ హంట్, లేజర్ ట్రాప్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ పి.దినేశ్‌శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను విడిచిపెట్టకుండా ఒడిసిపట్టుకోవాలన్నారు.



గోల్ కొట్టాల్సిందే

ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థులు రూపొందించిన కార్ సాకర్ ఆకట్టుకుంది. సొంత పరిజ్ఞానంతో తయారు చేసిన రెండు కార్లు కీలకపాత్ర పోషిస్తాయి. ఇద్దరు వ్యక్తులు పోటీలో పాల్గొని కార్లతో బంతిని తోసుకుంటూ గోల్ వేయాలి. మూడు నిమిషాల వ్యవధిలో ఎవరు ఎక్కువ గోల్స్ వేస్తే వారే విజేతలు.



ఆకట్టుకున్న ఇస్రో వాహనం

ఇస్రో సంస్థకు చెందిన సంచార వాహనం ఏపీ నిట్‌లో కొలువుదీరింది. ప్రత్యేకంగా తయారు చేసిన ఈ వాహనంలో అంతరిక్ష పరిజ్ఞానం, ఉపగ్రహాలు, చంద్రయాన్, మంగళయాన్ ప్రయోగాలు, నేవిగేషన్ సిస్టం వంటి ఎన్నో విషయాలు ఇందులో పొందుపరిచారు.

ఆసక్తికరంగా లేజర్ ట్రాప్ గేమ్

లేజర్ ట్రాప్ గేమ్ ఆసక్తికరంగా ఉంది. లేజర్ లైట్లను గదిలోని అన్ని దిక్కుల్లో ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా వచ్చే కాంతి కిరణాలు ఒంటికి తగలకుండా కృత్రిమంగా ఏర్పాటు చేసిన బాంబు వద్దకు వెళ్లి నియంత్రించాలి. అయిదు నిమిషాల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తిచేసిన వారు విజేతలుగా నిలుస్తారు.



తణుకు టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ దర్యాప్తు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో వెలుగుచూసిన టీడీఆర్ కుంభకోణంపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం తణుకు మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక అధికారులను విచారించారు. నిబంధనల విరుద్ధంగా జారీ చేసిన ఈ వ్యవహారంపై ఆరా తీశారు. ఇప్పటికే అనిశా అధికారులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే.

స్వల్ప పెట్టుబడితో.. ఆరోగ్యకర దిగుబడులు 16లో

కౌలు రైతులపై కరుణ


ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, మొగల్తూరు, న్యూస్‌టుడే: "రాష్ట్రంలో అర్హులైన కౌలు రైతులందరికీ రుణాలు అందించాలి. వడ్డీ వ్యాపారుల చేతిలో వారు చిక్కుకుపోకుండా చూడాలి" అని ఇటీవల రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.

వైకాపా నిర్లక్ష్యంతో గత అయిదేళ్లు కౌలు రైతులు రుణాల కోసం పడరాని పాట్లు పడ్డారు. బ్యాంకుల నుంచి రుణాలందక.. కష్టకాలంలో సాయమందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధిక శాతం కౌలుదారులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయకపోవడంపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

70 శాతానికి పైగా.. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా వరి, చెరకు, పొగాకు, మొక్కజొన్న, అరటి, పామాయిల్ తదితర పంటలు పండిస్తారు. ఇందులో 70 శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారు. ఏటా పంట కోత, నూర్పిడికి వచ్చే నవంబరు, డిసెంబరు నెలల్లో తుపాన్లు, వాయుగుండాల ప్రభావంతో రూ.లక్షల్లో నష్టపోతున్నా గత ప్రభుత్వం వారిని పట్టించుకోలేదు.

అర్హులందరికీ అందేలా ఎన్డీయే చర్యలు

'మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. వైకాపా హయాంలో రుణం కోసం ఎన్నోసార్లు బ్యాంకుల చుట్టూ తిరిగినా రాలేదు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. బయట వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెడుతున్నా" అని పెంటపాడుకు చెందిన వీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు.



● రైతులకు గత వైకాపా ప్రభుత్వంలో కన్నీళ్లే మిగిలాయి. భూ యజమాని అంగీకారం లేనిదే సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ) లభించలేదు. కార్డులు లేక, ప్రభుత్వ ప్రయోజనాలు పొందలేక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలయ్యారు. రుణాల కోసం ఆచంట, పెనుగొండ, పెనుమంత్ర, నరసాపురం మండలాల్లో బ్యాంకుల వద్ద ధర్నాలు, రైతుసేవా కేంద్రాల వద్ద ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. అర్హులైన కౌలు రైతులకు కూడా సాగు హక్కు పత్రాలు పొందలేకపోయారు.

"సీసీఆర్‌సీ పత్రం ఉన్నా బ్యాంకులు రుణాలు మంజూరు చేయలేదు. కనీసం రైతు భరోసా రాలేదు. గత ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోవడంతో బయట నుంచి అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి వ్యవసాయం చేస్తున్నా" అని కొప్పర్రుకు చెందిన గణపతి వాపోయారు.



మొదలైన కసరత్తు.. కౌలు రైతులకు గత తెదేపా హయాంలో అనేక ప్రయోజనాలు అందాయి. అదేస్థాయిలో సేవలందించేందుకు ఎన్డీయే సర్కారు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. దీని కోసం కమిటీని నియమించింది. రైతు సంఘాల ప్రతినిధులతో చర్చించి నూతన కౌలు చట్టం తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. రుణాలిచ్చేలా బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రుణాలు ఇవ్వడానికి నిబంధనలు సరళతరం చేయాలని కోరుతున్నారు. సీసీఆర్‌సీ కార్డు ఉన్న కౌలురైతులకు రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ జేడీ వెంకటేశ్వరరావు తెలిపారు.

పశ్చిమ గోదావరి జిల్లా

మండలాలు	సాగు విస్తీర్ణం	కౌలుదారులు	సీసీఆర్‌సీ కార్డులు	రుణాలు పొందిన వారు	ఇచ్చిన రుణాలు
20	2.12 లక్షల ఎకరాలు	సుమారు 1.42 లక్షలు	87,178	6,399	రూ. 296 కోట్లు (18/10/24 వరకు)

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

కాళ్ల, న్యూస్‌టుడే: రైతులు, భూ యజమానులు రీసర్వే గ్రామ సభలో దరఖాస్తు చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాల సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. జక్కరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో రైతులు, భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో నిర్వహించిన రీసర్వేలకు సంబంధించిన తప్పిదాలను సరిద్దుకునేందుకు 30 వరకు నిర్వహించనున్న రెవెన్యూ రీసర్వేకు సంబంధించి అన్ని రకాల దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

ఆనందరూపా.. ఆపద్బాంధవా!

- ✦ వైభవంగా శ్రీవారి రథోత్సవం
- ✦ తిరువీధుల్లో విహరించిన శ్రీనివాసుడు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా సాగింది. రాత్రి చల్లని వాతావరణంలో విద్యుద్దీప కాంతులు ప్రకాశిస్తుండగా భక్తుల గోవింద నామస్మరణలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ క్షేత్ర తిరువీధుల్లో స్వామివారి రథయాత్ర ఆద్యంతం కనుల పండువగా సాగింది. రథాన్ని పలు రకాల పచ్చిపూలు, రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.



రథోత్సవంలో పాల్గొన్న ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈవో మూర్తి తదితరులు



రథాన్ని లాగుతున్న భక్తులు (అంతర్ చిత్రంలో) స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు



రాజమన్నార్ అలంకారంలో దర్శనం

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో విశేష అలంకారంలో కనువిందు చేస్తున్నారు. శుక్రవారం రాజమన్నార్ అలంకారంలో దర్శనమిచ్చారు.

కల్యాణమహోత్సవాల్లో ఈనాడు

- ✺ ఉదయం 10.30 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు స్వామివారి ధ్వజావరోహణ.
- ✺ రాత్రి 9 గంటలకు అశ్వవాహనంపై శ్రీవారి గ్రామోత్సవం.

అతివల అక్షరాస్యతకు ఉల్లాస్

నవంబరు 5 నుంచి తరగతులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)ను ఉద్యమంలా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 11,216 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. నవంబరు 5న శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. పలు విడతల్లో 200 గంటల పాటు ఈ తరగతులు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.


పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో.. అక్షరాస్యతలో పశ్చిమగోదావరిని ముందంజలో నిలిపేందుకు 'ఉల్లాస్' దోహదం చేయనుంది. ఈ శిక్షణకు పొదుపు సంఘాల్లో మహిళలు, పాఠశాలల్లో పనిచేసే సహాయకులు, వంట పనివారు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను ఇప్పటికే గుర్తించారు. ఏలూరు జిల్లాలో 7321 మంది, పశ్చిమగోదావరిలో 3,895 మంది ఉన్నారు. వీరికి నిర్ణీత షెడ్యూలు ప్రకారం.. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. ప్రతి 10 మందికి ఓ వాలంటీరును నియమిస్తారు. ఫంక్షనల్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతపై అభ్యసన ఉంటుంది. డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, డీపీవో, గ్రామ, వార్డు సచివాలయం, డీపీఆర్వో, విద్యాశాఖ అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అభ్యసనను విజయవంతం చేసేలా ఎంపిక చేసిన పర్యవేక్షక అధికారులకు తొలుత శిక్షణ ఇస్తారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తామని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకర్ చెప్పారు.



అవగాహన కార్యక్రమంలో మెప్మా సభ్యులు(పాత చిత్రం)

శవాగారంలో మాయగాడు

మృతదేహం మాయంతో ఉలిక్కిపడ్డ అధికారులు



తేదీ : అక్టోబరు 8
సమయం: అర్ధరాత్రి ఒంటిగంట
ఏం జరిగింది: మృతదేహం అపహరణ యత్నం
ఎక్కడ : జిల్లా కేంద్రం ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారంలో మృతదేహం మాయమైన ఘటన చోటు చేసుకోవడంతో యంత్రాంగం ఉలిక్కిపడింది. ఇక్కడ ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. ఈ నెల 8న రాత్రి ఓ మహిళా సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా పగలు విధులు నిర్వహించిన వ్యక్తి అర్ధరాత్రి దాటాక శవాగారంలోకి వెళ్లి ఓ అనాథ శవాన్ని అంబులెన్సు లో ఎక్కించి పంపించేశాడు. కాసేపటికి అక్కడకు వచ్చిన మహిళా సిబ్బంది అతడిని నిలేశారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో సదరు వ్యక్తి మృతదేహాన్ని వెనక్కు రప్పించి యథాస్థానంలో ఉంచాడు. మృతదేహం మాయం చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని అక్కడ నుంచి తొలగించి ప్రభుత్వ వైద్య కళాశాల మార్చురీ వద్ద విధుల్లో పెట్టారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ దీని పై విచారణ చేయాల్సిందిగా ఆసుపత్రి పర్యవేక్షకుడికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

మొదలైన విచారణ.. ఈ ఘటన వెలుగు చూడటంతో అందరి దృష్టి ఇప్పుడు మార్చురీ పై పడింది. గతంలో కూడా ఇలా మృతదేహాలను మాయం చేశారా, అనాథ శవాలను అమ్మేశారా అనే అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. గతంలో మార్చురీల వద్ద నుంచి అధికారికంగా అనాథ శవాలను కొన్ని వైద్య కళాశాలల రూ.10 వేలకు కొనుగోలు చేస్తుండేవి. ప్రస్తుతం ఆ ధర రూ. లక్ష నుంచి లక్షన్నరకు చేరింది. దీంతో అనధికారికంగా మృతదేహాలను అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

హెచ్చరికలతో సరి.. ఆపేవారేరీ

అనధికార లేఅవుట్లలో ఆగని విక్రయాలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతుల్లేని లేఅవుట్‌లో స్థలాలు కొని సామాన్యులు మోసపోతూనే ఉన్నారు. దళారుల మాయమాటలు నమ్మి ఏళ్ల తరబడి కూడబెట్టిన కష్టార్జితాన్ని ధారపోసి, అప్పులు చేసి కొన్న స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బ్యాంకు రుణాలు రావని తెలిసి సామాన్యులు లబోదిబోమంటున్నారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై చర్యలు చేపట్టినా అవన్నీ మొక్కుబడి తంతుగా మారిపోయాయి.

72 ప్రాంతాల్లో.. వైకాపా పాలనలో పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు వెలిశాయి. వ్యాపారులు తమ చేతికి మట్టి అంటకుండా ఏజెంట్ల ద్వారా స్థలాలు విక్రయించారు. ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ఈ అంశంపై దృష్టిసారించారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(యుడా) పరిధిలో 72 ప్రాంతాల్లో 151 ఎకరాల విస్తీర్ణంలో అనధికార లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. పట్టణాల వారీగా పరిశీలిస్తే భీమవరం- 55.64, పాలకొల్లు-0.66, తాడేపల్లిగూడెం- 13.18, తణుకు- 21.53, ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో 93.90 ఎకరాల విస్తీర్ణంలో అనధికార లేఅవుట్లు ఉన్నట్లు లెక్కతేల్చి ప్రభుత్వానికి నివేదించారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు అలాంటి లేఅవుట్ల వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు ప్రక్రియను ఈ ఏడాది ఆగస్టులో చేపట్టారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఫొటోలకే పరిమితం

అనధికార లేవుట్ల వద్ద అధికారులు, సిబ్బంది హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఫొటో దిగారు. తరువాత పరిశీలిస్తే అక్కడ ఎలాంటి ఫ్లెక్సీలు లేవు. ఒకే ఫ్లెక్సీ ముద్రించి పట్టణ పరిధిలో ఉన్న అన్ని అనధికార లేఅవుట్ల వద్ద ఇలా ఫొటోలు దిగినట్లు తెలుస్తోంది. మరోపక్క అధికారులు గుర్తించిన తర్వాత కూడా సంబంధిత లేఅవుట్లలో స్థలాల క్రయవిక్రయాలు కొనసాగుతున్నా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఈ అంశంపై ఆకివీడు నగర పంచాయతీ టీపీవో రాధాకృష్ణ స్పందిస్తూ ప్రతి అనధికార లేఅవుట్ వద్ద హెచ్చరిక బోర్డులకు అయ్యే ఖర్చులకు పాలకమండలి సమావేశంలో ఆమోదం పొందాలన్నారు. కమిషనర్ కృష్ణమోహన్ స్పందిస్తూ అన్ని చోట్లా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య నిర్వహణకు ఇతర రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్న సాంకేతికతపై అధ్యయనం చేసి ఇక్కడి పట్టణాల్లోనూ అమలు చేసేలా దృష్టి సారించాలని పురపాలక కమిషనర్లకు కలెక్టర్ నాగరాణి సూచించారు. వారితో ఆమె కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో గుర్తించిన 11 పార్కులను మరింత అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ● జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు శుక్రవారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ నాగరాణి సూచించారు. కార్తిక మాసం సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



సమావేశంలో కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

తీరాన్ని వణికించిన కెరటం

ఇసుక అక్రమ రవాణాతో ముప్పు



చినమైనవానిలంక ప్రాంతంలో మునిగిన చెరువులు

నరసాపురం, న్యూస్‌టుడే: నియోజక వర్గంలోని సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలు రెండ్రోజులుగా సముద్ర అధిక పోటుకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని వణికిపోతున్నారు. బంగాళాఖాతంలో సంభవించే అల్పపీడనం, తుపానులకు సముద్రం పోటెత్తడం సహజం. కానీ సముద్ర నీరు గ్రామాలను చుట్టుముట్టిన సందర్భాలు చాలా తక్కువ. ● గత వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో సముద్ర తీరంలోని ఇసుక తిన్నెలను ధ్వంసం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు. అందువల్ల సముద్రం సాధారణ రోజుల కంటే పోటెత్తిన సమయంలో కెరటాల ఉద్ధృతికి సముద్ర నీరు పీఎం లంక, చినలంక తదితర గ్రామాలను చుట్టుముట్టింది. ● సముద్ర పోటు ప్రభావంతో సముద్ర తీర ప్రాంత గ్రామాల్లోని పలువురికి చెందిన ఆక్వా చెరువులు నీటమునిగాయి.

అండగా ఉంటాం ..: ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా అండగా ఉంటామని, ఆందోళన చెందవద్దని ఆర్డీవో దాసి రాజు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తీర ప్రాంత వాసులకు భరోసా ఇచ్చారు. చినమైనవాని లంక, పీఎం లంక, మోళ్లపర్రు తదితర గ్రామాల్లో పర్యటించారు.



ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

కాలువలు 11

ముంపు నివారణకు ముందస్తు చర్యలు

నీటి విడుదల 3 వేల క్యూసెక్కులు

భీమవరం వ్యవసాయ విభాగం, ఉండి, న్యూస్‌టుడే: వాయుగుండం తీరం దాటినా వరుణుడు శాంతించలేదు. నిత్యం పలు ప్రాంతాల్లో అకస్మాత్తుగా కారు మబ్బులు కమ్మేసి జడివాన కురుస్తోంది. నాలుగైదు రోజులతో పోల్చి చూస్తే ఉండి, భీమవరం ప్రాంతాల్లో శుక్రవారం వర్షం ప్రభావం కాస్త ఎక్కువగానే కనిపించింది. మిగిలిన ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా డెల్టాలో 11 ప్రధాన పంట కాలువలకు సాగునీటి విడుదలను 3 వేల క్యూసెక్కులకే పరిమితం చేసింది.

అవసరమైన ప్రాంతాలకే.. ఉమ్మడి జిల్లాలో డెల్టా వ్యవస్థ ద్వారా సాగు, తాగు నీటి అవసరాలకు ఈ నెల 12, 13, 14 తేదీల్లో పంట కాలువలకు 5 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. ఖరీఫ్ పంట కీలక దశకు చేరిన వేళ వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురవడంతో సాగునీటి విడుదలను క్రమంగా తగ్గిస్తూ వచ్చారు. నరసాపురం, బ్యాంకు కాలువలకు శుక్రవారం గరిష్ఠంగా 1,253 క్యూసెక్కులనీరిచ్చారు.

● పరిమెళ్ల లాకుల ప్రాంతంలో వీఅండ్‌డబ్ల్యూ కాలువకు తాగు, సాగు అవసరాల కోసం నీరిస్తున్నారు. గణపవరం దిగువకొచ్చేసరికి ఈ కాలువలోకి వివిధ డ్రెయిన్ల నుంచి మురుగు కలుస్తోంది. వెంకయ్య వయ్యేరులోనూ ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చేలల్లో మురుగు నిలిచిపోకుండా అన్ని సర్‌ప్లస్ వియ్యర్లను తెరిచి అదనపు జలాలను మళ్లిస్తున్నట్లు జలవనరుల శాఖ ఉండి డీఈఈ సత్యనారాయణమూర్తి తెలిపారు.

కాలువ	విడుదల చేసిన నీరు (క్యూసెక్కులు)
ఏలూరు	654
జీఅండ్‌వీ వెంకయ్య వయ్యేరు	411
ఉండి (ప్రధాన కాలువ)	400
అత్తిలి	273



ఉండి ప్రధాన పంట కాలువ

అత్తిలిలో 30.2 మి.మీ. వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు 7.3 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్తిలి అత్యధికంగా 30.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉండి 25.2, ఆకివీడు 19.6, మిగిలిన మండలాల్లో పది మి.మీ. కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

వానొస్తే ఇంతే..!



భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భీమవరంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పలుప్రాంతాలు జలమయమయ్యాయి. కలెక్టరేట్ ఆవరణలోనూ నీరు నిలిచిపోవడంతో ఇలా కనిపించింది.

ట్రిపుల్ ఐటీలో కార్యశాల



పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ నూజివీడు, టిహబ్ ఐటీ హైదరాబాద్ వారి సహకారంతో నూజివీడు క్యాంపస్‌లో 'ఇన్నిస్ ఆఫ్ రోడ్డు వెహికల్ డిజైన్, అనాలిసిస్'పై కార్యశాల శుక్రవారం నిర్వహించారు. ఇది 'ఆటోనమస్ ఆఫ్ రోడ్డు కార్ట్ వెహికల్ ప్రాజెక్టులో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద నిర్వహించారు. కార్యశాలకు కీనోట్ స్పీకర్లుగా ఎన్ఐటీ రూర్కెలా నుంచి డాక్టర్ స్వప్నిల్, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇషికర్ హుస్సేన్ పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా.ఉదయ్‌కుమార్, కోప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ రియాజ్ హుస్సేన్, భానుకిరణ్ కార్యశాల నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ నూజివీడు ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఆచార్య అమరేంద్రకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. క్యాంపస్‌లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం ఆనవాయితీగా ఉంది. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా మెకానికల్ డిపార్ట్‌మెంట్, మెకానికల్ ఇంజినీరింగ్, డా.పావని, కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య దరఖాస్తు గడువు పెంపు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో జి.నాగమణి తెలిపారు. అపరాధ రుసుము రూ. 200తో 29 వరకు, రూ. 500తో ఈ నెల 31 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఏలూరు పట్టణ అభివృద్ధి సంస్థ

ఆర్.సి.నెం. 105/2023/PLNG/EUDA

హెచ్చరిక

ఏలూరు పట్టణ అభివృద్ధి సంస్థ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ఈ క్రింద జాబితాలో పొందుపరచిన స్థలము/ ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారముగా లేఅవుట్ వేసియున్నారు.

క్ర. సం.	అనధికార లే-అవుట్ పేరు	విస్తీర్ణము (ఎకరాలలో)	సర్వే నెంబరు	గ్రామము	మండలము
1	కొమరాడ గ్రామంలోని అనధికార లేఅవుట్	2.07	43/2	కొమరాడ	భీమవరం
2	ముత్యాలపల్లి గ్రామంలోని అనధికార లేఅవుట్	1.17	126/1, 2A1	ముత్యాలపల్లి	మొగల్తూరు
3	ముత్యాలపల్లి గ్రామంలోని అనధికార లేఅవుట్	0.48	118/10	ముత్యాలపల్లి	మొగల్తూరు
4	ముత్యాలపల్లి గ్రామంలోని అనధికార లేఅవుట్	0.54	101/7	ముత్యాలపల్లి	మొగల్తూరు
5	ముత్యాలపల్లి గ్రామంలోని అనధికార లేఅవుట్	0.25	83/1D	ముత్యాలపల్లి	మొగల్తూరు
6	ముత్యాలపల్లి గ్రామంలోని అనధికార లేఅవుట్	1.50	126/8	ముత్యాలపల్లి	మొగల్తూరు
7	ముత్యాలపల్లి గ్రామంలోని అనధికార లేఅవుట్	4.36	81/2	ముత్యాలపల్లి	మొగల్తూరు
8	ముత్యాలపల్లి గ్రామంలోని అనధికార లేఅవుట్	1.50	126/1	ముత్యాలపల్లి	మొగల్తూరు
9	గవరవరం గ్రామంలోని అనధికార లేఅవుట్	2.50	48/1	గవరవరం	కొయ్యలగూడెం
10	గవరవరం గ్రామంలోని అనధికార లేఅవుట్	2.60	48/1	గవరవరం	కొయ్యలగూడెం
11	గవరవరం గ్రామంలోని అనధికార లేఅవుట్	2.00	2/5A	గవరవరం	కొయ్యలగూడెం

కావున పైన తెలియపరచిన లే అవుట్ల నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లకు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయబడవు. మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంటు, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించబడవు.

దీనిని గమనించవలసినదిగా విజ్ఞప్తి.

గమనిక:- అనధికారముగా లే అవుట్ వేసి మరియు అమ్మకములు చేయుచున్న స్థల యజమానులు లేదా డెవలపర్లపైన చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయి.

సం/- **వైస్ ఛైర్మన్,** ఏలూరు పట్టణ అభివృద్ధి సంస్థ

స్వల్ప పెట్టుబడితో.. ఆరోగ్యకర దిగుబడులు

ఆలోచింపజేస్తోన్న చిరుధాన్యాల ప్రదర్శనా క్షేత్రాలు

భీమవరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుపై అక్కడ ఏర్పాటుచేసిన ప్రదర్శనా క్షేత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలనుకునే వారిని మరింతగా ఆలోచింపజేస్తున్నాయి. నేడు అత్యధికుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తడానికి ఆహారపు అలవాట్లేనని స్పష్టమవుతోంది. సరైన పోషక విలువలు, ఎక్కువ ఖనిజ పదార్థాలున్న ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యాన్ని మరింత కాలం కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. బియ్యం, గోధుమల్లో కంటే చిరుధాన్యాలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, అరికెలు, సామలు, అండుకొర్రలు, వరిగలు, ఊదలు తదితర వాటిలో పీచు పదార్థం అధికంగా లభిస్తోందని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎన్.మల్లికార్జునరావు, వినయలక్ష్మిలు వివరించారు.

హెక్టారుకు 17 క్వింటాళ్ల దిగుబడి

నీలాద్రిపురం, పట్టింపాలెం, కొవ్వాడఅన్నవరం గ్రామాల్లోని రైతు భూముల్లో తాము ఏర్పాటుచేసిన రాగుల పంట ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల్లో హెక్టారుకి 17 క్వింటాళ్ల చొప్పున దిగుబడి లభించిందని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లికార్జునరావు తెలిపారు. తేలిక రకం ఇసుక నేలలు, నీరు నిలువని బరువు నేలల్లోనూ ఆసక్తి గల రైతులు చిరుధాన్యాలు పండించొచ్చు. 5-10 సెంట్ల విస్తీర్ణంలో ఈ పంటలు వేసుకుంటే గృహ అవసరాలకు ఉపయోగపడతాయి. నవంబరు, డిసెంబరు నెలలు రబీలో విత్తుకునేందుకు అనువైన కాలం కొర్రలు, సామలు, జొన్నలు, రాగుల పంటలైతే ఎకరానికి 3-4 కిలోల విత్తనం సరిపోతోంది. సజ్జ 1.5 నుంచి 2 కిలోల విత్తనంతో ఎకరం చేలో నాటుకోవచ్చు. మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంది. రాబోయే కాలంలో వీటి పెంపకాన్ని మరింతగా పెంచాల్సిన అవసరాన్ని కేవీకే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. స్వల్ప పెట్టుబడితో బహుళ ప్రయోజనాలు పొందొచ్చని వివరిస్తున్నారు.





పెరట్లోనూ పెంపకం!

ఉభయ జిల్లాల్లో పట్టణాలు, ప్రధాన గ్రామాలకు చేర్చి మెరకభూములు పలుచోట్ల ఉన్నాయి. నీరు నిలవని అటువంటి మెరక ప్రదేశాలు, ఇంటి పెరట్లో సైతం చిరుధాన్యాలను సులభంగా పండించుకోవచ్చు. ఎటువంటి వాతావరణ పరిస్థితులు తలెత్తినా తట్టుకొని మంచి ఉత్పత్తిసాధించే శక్తి వీటికి ఉంది. పిల్లల ఎదుగుదలకు, శరీర ఆరోగ్యానికి కావాల్సిన సూక్ష్మపోషకాలు ఈ ఆహారంలో అధికంగా లభిస్తాయి.

శాంతిధాంలో వాసవీ హోమం

పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీశాంతిధాం శుక్రవారం కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ(షిమోగా) పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. గోమాత పూజ, మరకత వాసవీ కన్యకా పరమేశ్వరికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, వాసవీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం బీజేపీ ఎమ్మెల్సీ డి.ఎస్. అరుణ్, ప్రతిభ దంపతులు పాల్గొన్నారు. పలువురు భక్తులు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ(షిమోగా)లో వాసవీ అమ్మవారిని ప్రతిష్ఠాపన చేసి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2025 ఫిబ్రవరి నెలలో వంద సంవత్సరాల వేడుకలు ఘనంగా నిర్వహించాలని అమ్మవారిని దర్శించి ఆశీస్సులు తీసుకున్నామని వివరించారు.



ఆరు కాస్తా.. ఇక్కడ రెండే..

జాతీయ రహదారిపై ఇక్కట్లు

16వ నంబరు జాతీయ రహదారిపై ఏలూరు ఆశ్రం కూడలి సమీపంలోని రైలు వంతెన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆరు లైన్ల విస్తరణ పనుల్లో భాగంగా ఇక్కడ మూడు లైన్ల ఆర్వోబీ పనులు చేపట్టారు. అర్వోబీ పనులు ముందుకు సాగక, గతంలో నిర్మించిన రెండు లైన్ల ఆర్వోబీ మీదుగానే వాహనాలు నడుస్తున్నాయి. అప్రోచ్ రహదారులకు కొంత వరకు పనులు చేసి వదిలేశారు. దీంతో ఆరులైన్ల రహదారి ఇక్కడకొచ్చేసరికి రెండులైన్లకే పరిమితమైంది. జాతీయ రహదారిపై అత్యంత వేగంగా వస్తున్న వాహనాలు మలుపు దగ్గర నియంత్రించలేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. ప్రస్తుతం రైలు వంతెన శిథిలావస్థకు చేరింది. ✦ దీనిపై విజయవాడ రీజియన్ ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్వోబీ పనులకు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని, గుత్తేదారుతో మాట్లాడి నిర్మాణ పనులు చేయిస్తామన్నారు. **-ఈనాడు, ఏలూరు**



ఆర్వోబీ పనులు అసంపూర్తిగా ఉండటంతో రహదారి మళ్లింపు కోసం అడ్డంగా ఉంచిన బారికేడ్లు



పాత ఆర్వోబీ వద్దకిందారిలో శిథిలమైన సిమెంట్ పలకలు

కొద్ది రోజుల విరామం.. నింగికి రంగులద్దినట్లు!

కొద్ది రోజుల విరామం తర్వాత వాతావరణం కొనసాగుతోంది. ఎక్కువ సమయం ఆకాశం మబ్బులతో నిండి ఉంటుంది. వాయుగుండం తీరం దాటడంతో పాటు పొద్దున కావడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు నింగి పండు వెన్నెలతో, విభిన్న వర్ణాలతో కను విందు చేసింది. ఆకివీడు ప్రాంతంలో ఆక్వా చెరువుల వద్ద కనిపించిన ఈ దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను అలరించాయి. **- న్యూస్‌టుడే, ఆకివీడు**





శ్లాబు పెచ్చులూడి పడి విద్యార్థినికి గాయం

చింతపాడు జడ్పీ పాఠశాలలో ఘటన

మండవల్లి, న్యూస్‌టుడే: చింతపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శ్లాబ్ పెచ్చులూడి పడి ఏడో తరగతి విద్యార్థిని జయమంగళ జయశ్రీకి తీవ్ర గాయమైంది. మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనతో ఒక్కసారి పాఠశాలలోని విద్యార్థులంతా భయాందోళన వ్యక్తం చేశారు. తలకు తీవ్ర గాయమైనా.. ఉపాధ్యాయులు చిన్న గాయం అంటూ ఆర్‌ఎంపీతో చికిత్స అందించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించి చిన్నారికి వైద్యం అందించారు. పాత శాల భవన సముదాయం మూడేళ్ల క్రితం శిథిలావస్థకు చేరింది. శిథిల భవనాలను తొలగించాలని రెండేళ్ల క్రితం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ప్రస్తుతం ఏడు తరగతి భవనాలను కూల్చి వేసే విద్యార్థులను ఎక్కడికి తరలించాలో తెలియకపోవడంతో శిథిల భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతన తరగతి గది భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనా అధికారులు, నాయకుల నిర్లక్ష్యంతో అవి సన్‌సైడ్ వరకు వచ్చి నిలిచిపోయి విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. దీనిపై ఇప్పటికే పలుమార్లు 'ఈనాడు' కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే.



తలకు తగిలిన దెబ్బ

పాఠశాలలో గాయపడ్డ జయశ్రీ

చోరీ కేసులో అంతర్ జిల్లా నేరగాడి అరెస్టు

సొత్తు స్వాధీనం

నరసాపురం, న్యూస్‌టుడే: చోరీ కేసులో అంతర్ జిల్లా నేరగాడిని అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నామని అదనపు ఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని 20వ వార్డు గాంధీనగర్ పిల్లిపేటకు చెందిన రవ్వ ఉమామహేశ్వరి పగలు ప్రయివేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తూ రాత్రి సమయంలో అత్యవసర వాహనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 1న రాత్రి ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులకు వేసిన తాళం పగుల కొట్టి సుమారు రూ.2.50 లక్షలు విలువ గల 122గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి ఆభరణాలు అపహరించుకు పోయారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు ఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో పట్టణ సీఐ బి.యాదగిరి, ఎస్సైలు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం చింతాడ గ్రామానికి చెందిన నిందితుడు మండెల నాగ భాస్కరరావును అరెస్టు చేశారన్నారు. అతని నుంచి 71.47 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో 15 కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ఇదే కేసులో మరో నిందితుడిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ బి.యాదగిరి, ఎస్సైలు ఎస్.ఎన్.నాగేశ్వరరావు, సీహెచ్ జయలక్ష్మి, హెచ్‌సీ కె.వేణుగోపాల్, పీసీ జి.శ్రీనుబాబులను ఆయన అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ మురళీ కృష్ణ

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

బాలుడిపై పోక్సో కేసు

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలులో బాలికను ప్రేమ పేరిట తీసుకెళ్లిన బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన బాలికను గుణ్ణంపల్లికి చెందిన బాలుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, ఈ నెల 9న తీసుకెళ్లాడు. బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు తొలుత అదృశ్యం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఓ కల్యాణ మండపం గదిలో ఉండటం చూసి అదుపులోకి తీసుకున్నారు. ఆపై పోక్సో కేసుగా మార్పు చేశారు.

శ్మశాన వాటిక వద్ద ఉద్రిక్తత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: మృతదేహాన్ని ఖననం చేసే విషయమై స్థానిక ఆరో వార్డులోని హిందూ శ్మశానవాటిక వద్ద శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు.. అదే ప్రాంతానికి చెందిన క్రైస్తవ మతానికి చెందిన గోగు లవండ సుదీప్(18) తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం భవన నిర్మాణ పనుల నిమిత్తం అత్తిలి వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. అతని మృతదేహాన్ని ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు ఇంటి సమీపంలోని హిందూ శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ హిందువుల దహన కార్యక్రమాలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో యువకుడిని పూడ్చిపెట్టడంతో గొయ్యి తవ్వడంతో శ్మశానవాటిక సిబ్బంది అడ్డుపడ్డారు. దీంతో అక్కడ మరింత వాతావరణం నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం అక్కడికి వచ్చి వారితో చర్చించారు. క్రైస్తవ మతస్థులకు కావాల్సిన శ్మశానవాటికను వారంలో రోజుల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఆర్డీవో సూచన మేరకు యువకుడి మృతదేహాన్ని పాతూరులోని శ్మశానవాటికలో ఖననం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



గన్‌పౌడర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు

పెదపాడు, న్యూస్‌టుడే: గన్‌పౌడర్‌కు నిప్పంటుకొని పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన వీరమ్మకుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌ఛార్జి ఎస్సై శారద సతీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రెడ్డి అప్పారావు చేపల చెరువుకు కృష్ణా జిల్లా నందివాడ మండలం తుమ్మలపల్లికి చెందిన కాపలాదారు కోడికత్తుల కాపలాదారుగా ఉన్నారు. వీరమ్మకుంటకు చెందిన మేతల సురేశ్, సామర్లకోటకు చెందిన మల్లి సత్తిబాబు చెరువు వద్ద పని చేస్తున్నారు. అక్కడి పెద్ద వద్ద పాల్‌బాబు గన్‌పౌడర్ కలుపుతుండగా.. మిగతా ఇద్దరు పాత టపాసుల్లోని బూందీని బయటకు తీసి నిప్పంటించారు. ఆ సమయంలో మంటలు గన్‌పౌడర్‌పై పడటంతో.. భారీ శబ్దంతో పేలింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పాల్‌బాబును మెరుగైన సేవల నిమిత్తం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జి డీఎస్పీ శ్రావణ్‌కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. వీరమ్మకుంటలో అనుమతి లేకుండా బాణసంచా తయారీ జరుగుతోందని సమాచారం రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు.

నేడు భాజపా రాష్ట్ర ఇన్‌ఛార్జి రాక

ఉంగుటూరు, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర ఇన్‌ఛార్జి సిద్ధార్థనాథ్ సింగ్ శనివారం చేబ్రోలులో పర్యటిస్తారని శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులతో మాట్లాడతారన్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.05 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

•భీమవరం •ఉండి

వేద పండితులకు సత్కారం



సభకు హాజరైన పండితులు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: వేదశాస్త్ర పరిషత్తు మహాసభ జువ్వలపాలెం రోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. ప్రముఖ పండితులు గుళ్లపల్లి సీతారామచంద్ర, ఈమని శ్రీరామచంద్రసోమయాజి మాట్లాడారు. 96 మంది ఘనాపాఠీలు, క్రమపాఠీలు పాల్గొని వేద పఠనం చేశారు. అనంతరం వారిని సత్కరించారు. పరిషత్తు అధ్యక్షుడు వేలూరి వేణుగోపాల్, కార్యదర్శి జేవీవీ రామకృష్ణ, సహాయ కార్యదర్శి బంద శేషసుబ్రహ్మణ్యం, కోశాధికారి మల్లాది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం

పాలకోడేరు, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవడం హర్షణీయమని తెదేపా ఉండి నియోజకవర్గ నాయకుడు కామన రాంబాబు పేర్కొన్నారు. బీసీలపై దాడులు, వేధింపులు పాల్పడే వారికి శిక్షలు పడే విధంగా ఈ చట్టం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. తెదేపా హయాంలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

22 నుంచి ఆధార్ శిబిరాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య తెలిపారు. ఈ శిబిరాల్లో బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 22న శృంగవృక్షం, వేంద్ర, పాలకోడేరు, 23న పెన్నాడ అగ్రహారం, కొండేపూడి, వేంద్ర అగ్రహారం, కుముదవల్లి, 24న గొరగనమూడి, మోగల్లు, గొల్లలకోడేరు, 25న విస్సాకోడేరు, కోరుకొల్లు, మైప, గరగపర్రు గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు.

వసతి గృహంలో తనిఖీలు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం చిన్నఅమిరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేఖాబాబు శుక్రవారం తనిఖీలు చేశారు. నిర్వహణ తీరును, దస్త్రాలను పరిశీలించారు. ప్యానెల్ న్యాయవాదులు లోకేశ్వరరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు అతికిస్తే రూ.2 లక్షల జరిమానా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పురపాలక అధికారుల అనుమతి లేకుండా గోడపత్రాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి హెచ్చరించారు. విద్యుత్తు స్తంభాలు, రహదారి విభాజకాలు, ప్రభుత్వ ప్రహరీలకు గోడపత్రాలు అతికిస్తే రూ. 2 లక్షల వరకు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	:80085 74474		

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: జువ్వలపాలెం రోడ్డు నుంచి డీఎన్నార్ కళాశాల వరకు రహదారి గుంతలమయంగా ఉంది. **- ఈశ్వర్, ప్రైవేటు ఉద్యోగి**

సమస్య: పురపాలక సంఘం పరిధిలో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. గత విధానాలను కొనసాగిస్తుండడమే దీనికి కారణం. **- చిటిబాబు, సివిల్ కాంట్రాక్టర్**

సమాధానం: రహదారిపై గుంతలు పూడ్చే పనులు చేపట్టాం. వర్షాలు తగ్గాక పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. గతంలో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లించే ఏర్పాట్లు చేశాం. **- పి.త్రినాథరావు, ఎంఈ**

ఏళ్ల తరబడి.. మరమ్మతులూ కరవే..!



ఉండి నియోజకవర్గ పరిధిలో శృంగవృక్షం-వేంద్ర ఆర్అండ్‌బీ రహదారి ఇలా అస్తవ్యస్తంగా మారింది. పాలకోడేరు మధ్య నుంచి సుమారు 8 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ మార్గం అభివృద్ధికి 2019లో రూ.6 కోట్లు మంజూరయ్యాయి. పలు చోట్ల కల్వర్టులు, వంతెనలు నిర్మించారు. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటి నుంచి కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఈ రోడ్డు రూపు కోల్పోయింది. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ డీఈ పీవీ రామరాజు తెలిపారు.



కొమరాడ వైపు ఇలా..

భీమవరం- కొమరాడ రహదారి ఎక్కడికక్కడ గుంతలతో భయంకరంగా తయారైంది. ఈ మార్గంలో రాయలం, కొమరాడ, గొల్లవానితిప్ప, బేతపూడి, ఆనాకోడేరు, తుమ్మగొప్ప, పల్లిపాలెం, ఎల్‌వీఎన్ పురం గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రూ. కోట్ల విలువైన ఆక్వా ఉత్పత్తుల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో ఇలా తయారైంది.





దిగబడిన లోడు లారీ

భీమవరం గ్రామీణ, పాలకోడేరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇప్పటికే అధ్వానంగా మారిన రహదారులు ప్రస్తుత వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. కొద్ది నెలల కిందటి వరకు ద్విచక్ర వాహన చోదకులు గుంతలను తప్పించుకుంటూ ముందుకు సాగేవారు. ఇప్పుడు కనీసం పాదచారులు కూడా వెళ్లలేనంత దారుణంగా తయారయ్యాయి. వాననీరు నిలిచిపోవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గాలకు తాత్కాలిక మరమ్మతులైనా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కాళ్ల, న్యూస్‌టుడే: కలవపూడి ఉన్నత పాఠశాల విద్యార్థిని వి. మోహన శ్రీలక్ష్మీదుర్గ ఈ నెల 17న ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి విజయనగరం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి (అండర్-14) వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రామాంజనేయులు తెలిపారు.

నృత్య సమ్మేళనంలో ప్రతిభ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణలోని త్యాగరాయ గానసభ ప్రధాన మండపంలో జరిగిన అంతర్జాతీయ సంగీత, నృత్య సమ్మేళనంలో భీమవరం కేజీఆర్ఎల్ ఫార్మసీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పోటీలు ఈ నెల 13న జరగ్గా కళాశాలకు చెందిన కడలి భానుశ్రీ బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. వీరిని అభినందిస్తూ గన్నాబత్తుల ట్రస్టు తరపున రూ.11 వేల నగదు బహుమతిని శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

ప్రాధాన్య క్రమంలో సమస్యల పరిష్కారం

మెంటేపూడి, బాలేపల్లి, దూసనపూడి (వీరవాసరం), న్యూస్‌టుడే: భీమవరం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మెంటేపూడి, బాలేపల్లి, దూసనపూడి గ్రామాల్లో సుమారు రూ. కోటి వ్యయంతో చేపట్టిన రహదారుల నిర్మాణాలకు ఆయన శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు తెలుసుకొనేందుకు అన్ని గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటిస్తానన్నారు. ● దూసనపూడిలో సర్పంచి యర్రంశెట్టి నాగసాయి (జనసేన), మాజీ సర్పంచి దాడి కాశీనాయుడు(తెదేపా)ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానిక నాయకులు వారికి సర్దిచెప్పారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ఉచిత వైద్య సేవలతో పేదలకు భరోసా

కాళ్ల, న్యూస్‌టుడే: పేదలకు భరోసా కల్పించేలా ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దాదాపు 420 మందికి నేత్ర, దంత పరీక్షలు చేసి మందులు అందించారు. ఇక్కడ గుర్తించిన 80 మందికి ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు చేయిస్తామని ట్రస్టు ఛైర్మన్ దాట్ల వెంకటరామరాజు తెలిపారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ట్రస్టు ఛైర్మన్

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 1359/2023 in O.S.No. 252/2018

M/s Alltech Biotechnology Pvt. Ltd. Ro by its Authorised Representative Opp. Old Airport Road, Bangalore.
... Petitioner / Counter Claim Petitioner / Defendent
and
M/s Nexus Feeds Ltd., Rep. by its Managing Director Seesali Village
... Respondent / Plaintiff

పై నెంబరు దావాలో ప్రతివాది దాఖలు చేసిన Counter Claim సవరణ నిమిత్తం దాఖలు చేసిన I.A.No. 1359/2023 పిటీషన్‌లో రెస్పాండెంట్/వాది అయిన మీకు [illegible] Counter Claim సవరణ పిటీషన్ నోటీసు [illegible] ది. 5-11-2024వ తేదీ ఉదయం గం. 10.30 ని॥లకు [illegible] ద్వారా తెలియజేయడమైనది.

సం/- కట్టా ప్రసాద్
సెల్: 93462 85989
భీమవరం **K.H.R. Kumar,**
ది. 18-10-2024 సెల్: 85559 19689

అభ్యంతరాలపై పరిశీలన

వీరవాసరం, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా వీరవాసరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఎంపీడీవో ఎస్. కిరణ్‌కుమార్, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని శుక్రవారం క్షేత్ర పరిశీలన చేశారు. ఈ అంశంపై 'ప్రజాధనం వృథా' శీర్షికన ఈ నెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. బాగున్న సీసీ రహదారిపై మళ్లీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై ఎంపీడీవో విస్మయం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే రామాంజనేయులు దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీపీ భవాని తెలిపారు.



సంతమార్కెట్లో సీసీ రహదారిని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ఈనాడు స్పందన

ఆక్రమణల తొలగింపు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: రాయలం కోట్ల డ్రెయిన్ వద్ద ఆక్రమణలపై 'రూ.5 కోట్లు పోసి...గాలికి వదిలేసి' శీర్షికన ఈ నెల 5న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆశాఖ అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలో ఆక్రమణలను ఇటీవల యంత్రాలతో తొలగించారు. త్వరలోనే పనులు పూర్తి చేయనున్నట్లు ఏఈ ప్రకాశ్ తెలిపారు.



లోపాల సవరణకు రీ-సర్వే గ్రామ సభలు

వీరవాసరం, భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రీ-సర్వేలో లోపాల సవరణలు, వ్యవసాయ భూముల హెచ్చుతగ్గుల వివాదాల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వీరవాసరం మండలంలో తోకలపూడి, పంజావేమవరం గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామ సభల్లో ఆయన పాల్గొని రైతుల నుంచి 18 అర్జీలు స్వీకరించారు. భీమవరం మండలం నర్సింహపురంలో పొలం విస్తీర్ణానికి సంబంధించి 2, మ్యుటేషన్‌పై ఒక ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఆకివీడు, ఉండి, పాలకోడేరు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలం అజ్జమూరు, ఉండి మండలం కలిసిపూడి, చెరుకువాడ గ్రామాల్లో జరిగిన సభల్లో అధికారులు పాల్గొని రైతులు, భూ యజమాల నుంచి అర్జీలు స్వీకరించారు. పాలకోడేరు మండలం కొండేపూడి, వేంద్ర అగ్రహారం పంచాయతీల వద్ద నిర్వహించిన సభల్లో 11 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.




అజ్జమూరు: తహసీల్దారుకు అర్జీ అందిస్తున్న రైతులు

మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన



నినదిస్తున్న నాయకులు, మహిళలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో సిద్ధాపురం రైల్వే గేటు ప్రాంతంలోని చేపల మార్కెట్‌కు వెళ్లే మార్గంలో మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులు మహిళలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు తగదంటూ నినాదాలు చేశారు.



ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

KVB Karur Vysya Bank Smart way to bank

ఇ.నెం.22-15-91, ఎమ్ఆర్‌ఓ ఆఫీస్ ఎదురుగా, మెయిన్ రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534201. మొబైల్ నెం. 9959988581

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నందలి నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా **ఋణగ్రహీతలు మరియు హామీదారులకు** ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **ఋణగ్రహీత : 1. మెస్సర్స్ ప్రభ ఆడియో మరియు వీడియో డిజిటల్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీ ఉప్పులపాటి ప్రభాకర్,** డి.నెం.17-1-44, న్యూ బస్టాండ్ రోడ్డు, ఇండియన్ బ్యాంక్ ఎదురుగా, భీమవరం - 534201. **వేరొక చిరునామా : శ్రీ ఉప్పులపాటి ప్రభాకర్,** తండ్రి : ఉప్పులపాటి వెంకటేశ్వరరావు, డి.నెం. 25-5-15/2, సాగర్లపేట, వార్డు నెం.15, గునుపూడి, భీమవరం - 534201. **చట్టరీత్యా వారసులు : 2. శ్రీమతి ఉప్పులపాటి సరోజిని,** భర్త : ఉప్పులపాటి వెంకటేశ్వరరావు, డి.నెం.25-5-15/2, సాగర్లపేట, వార్డు నెం.15, గునుపూడి, భీమవరం - 534201. **3. శ్రీమతి బొందు గీతా దేవి,** తండ్రి : ఉప్పులపాటి వెంకటేశ్వరరావు, డి.నెం.25-5-15/2, సాగర్లపేట, వార్డు నెం.15, గునుపూడి, భీమవరం - 534201. **4. శ్రీ ఉప్పులపాటి విజయ భాస్కర్,** తండ్రి : ఉప్పులపాటి వెంకటేశ్వరరావు, డి.నెం.25-5-15/2, సాగర్లపేట, వార్డు నెం.15, గునుపూడి, భీమవరం - 534201. **5. శ్రీమతి సూరిశెట్టి శ్రీదేవి,** తండ్రి : ఉప్పులపాటి వెంకటేశ్వరరావు, డి.నెం.25-5-15/2, సాగర్లపేట, వార్డు నెం.15, గునుపూడి, భీమవరం - 534201 వారి నుండి రావల్సిన దిగువ తెలిపిన బకాయి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే లాంఛనంగా స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **తేది. 13-11-2024** న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అలానే ప్రాతిపదికన" విక్రయించబడును.

సౌకర్యం స్వభావం	ఖాతా నెంబరు	బకాయి మొత్తం	తదుపరి వడ్డీ తేదీ నుండి
OCC	1431223000000783	తేది.30.09.2024 నాటికి రూ.81,34,155.00	01.10.2024
GECL	1431808000000266	తేది.05.10.2024 నాటికి రూ.21,65,743.23	06.10.2024
	మొత్తం	రూ.1,02,99,898.23	

(అక్షరాల ఒక కోటి రెండు లక్షల తొంభై తొమ్మిది వేల ఎనిమిది వందల తొంభై ఎనిమిది రూపాయల ఇరవై మూడు పైసలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు:

షెడ్యూలు -ఎ1 : (శ్రీ ప్రభాకర్ ఉప్పులపాటి గారికి చెందిన ఆస్తి): పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం, చిన అమిరం గ్రామం, సమీప డోర్ నెం.2-235/1, ఆర్.ఎస్.నెం. 31/11, 31/12 మరియు 31/13 లోని 6292 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో 45.60 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా విస్తీర్ణంతో గాంధీస్ నెస్ట్ ఎ బ్లాక్, రెండవ అంతస్తు నందు 960 చ॥అ॥ల ప్లింత్ ఏరియాతో గల టు బెడ్ రూమ్ ఫ్లాట్ నెం.204. **అపార్ట్‌మెంట్ హద్దులు : తూర్పు :** పాతపాటి సత్రాజు మొ॥ వారి స్థలం, **పడమర :** వేంపాడు కాలువ (బోదె), **ఉత్తరం :** పాతపాటి సత్రాజు మొ॥ వారి స్థలం, **దక్షిణం :** వేంపాడు రోడ్డు. **ఫ్లాట్ హద్దులు: తూర్పు :** కారిడార్, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** డక్ట్, **దక్షిణం :** ఓపెన్ టు స్కై.

రిజర్వు ధర : రూ.19,00,000/-, ధరావత్తు : రూ.1,90,000/-, బిడ్ పెంపుదల : రూ.25,000/-

షెడ్యూలు -ఎ2 : (లేటు శ్రీ యు. వెంకటేశ్వరరావు గారికి చెందిన ఆస్తి): పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపల్ ఏరియా, మెంటెవారి తోట, వండర్ కిడ్స్ స్కూల్ దగ్గర, అసెస్మెంట్ నెం.1074002657 మరియు ఆర్.ఎస్.నెం.361/1 లోని 243 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో ఇంటి డి.నెం.5-10-2తో గల బెంగళూరు పెంకుటిల్లు. **హద్దులు : తూర్పు:** ఎమ్. తంబేశ్వరరావు గారి స్థలం, **దక్షిణం :** ఎమ్. శ్రీలక్ష్మి గారి స్థలం, **పడమర :** ఇదే నెంబర్ లోని ఎమ్. శ్రీ లక్ష్మి గారి స్థలం, **ఉత్తరం :** టి. సుగుణ గారి స్థలం.

రిజర్వు ధర : రూ.45,00,000/-, ధరావత్తు : రూ.4,50,000/-, బిడ్ పెంపుదల : రూ.25,000/-

గమనిక : బ్యాంకుకు వ్యతిరేకంగా ఋణగ్రహీత దాఖలు చేసిన SA No.424/2022 గౌరవనీయమైన డిఆర్‌టి విశాఖపట్నం ముందు పెండింగ్‌లో ఉన్నది.

అమ్మకం యొక్క వివరమైన నియమ నిబంధనల కొరకు బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్ వారి వెబ్‌సైట్: **www.kvb.co.in/Property Under Auction** మరియు **M/s.4Closure (bankauctions.in)** హైదరాబాద్ వారి వెబ్ పోర్టల్ : **https:// www.bankauctions.in** చూడండి

SARFAESI చట్టం, 2002 యొక్క రూల్ 9(1) క్రింద 15 రోజుల చట్టబద్ధ ప్రకటన.

చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన బకాయిలను వేలం తేదీలోపు చెల్లించవలెనని, లేనిచో, షెడ్యూల్ ఆస్తి వేలం వేయబడుతుందని/విక్రయించబడుతుందని మరియు మిగిలిన బకాయిలు ఏవైన ఉన్నట్లయితే, వడ్డీ మరియు ఖర్చులతో పాటు వసూలు చేయబడతాయని ఋణగ్రహీత/లు మరియు గ్యారంటర్/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

తేది: 17-10-2024 అధీకృత అధికారి
స్థలం: భీమవరం ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

ఇళ్ల మధ్యే మురుగు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలం వేంద్ర పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులకు ఏడాది పొడవునా ఇక్కట్లు తప్పడం లేదు. వర్షం కురిస్తే మురుగుతో పాటు వాన నీరు రోజుల తరబడి ఇళ్ల మధ్య, వీధుల్లో నిలిచిపోవడంతో నివాసితులు రోగాల బారిన పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ సామాజిక భవనం ప్రాంతాల్లోని పలు వీధుల్లో ప్రస్తుతం మురుగు, వాననీరు తిష్ఠవేసింది. దుర్వాసన, దోమల బెడదతో నిత్యం నరకం అనుభవిస్తున్నట్లు స్థానిక మహిళలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే పలువురు జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్నట్లు చెబుతున్నారు. మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి జి.కృష్ణమోహన్ తెలిపారు.



ఎస్సీ కాలనీ వీధిలో నిలిచిన వాననీరు



క్షీరాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

స్వర్ణకారుల సంక్షేమానికి కృషి

ఆకివీడు, న్యూస్‌టుడే: స్వర్ణకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని స్వర్ణకారుల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం స్వర్ణకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం లభించడం హర్షణీయమన్నారు. ఆకివీడులోని పొట్టి శ్రీరాములు విగ్రహం కూడలి వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సంఘం ఆకివీడు శాఖ అధ్యక్షుడు పి.రామకృష్ణ, కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

హోమియో వైద్యానికి గుర్తింపు

గునుపూడి, న్యూస్‌టుడే: నేటి సమాజంలో హోమియో వైద్యానికి మంచి గుర్తింపు ఉందని ప్రముఖ సినీ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్ పేర్కొన్నారు. భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న సంజీవ్ హోమియో కేర్ ఆసుపత్రి వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ వేడుకలో ఆయన పాల్గొని కేకు కోసి మాట్లాడారు. వైద్యుడు చిక్కం సత్య సంజీవ్, ప్రముఖులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న శ్రీకాంత్

నిబంధనల అమలు తప్పనిసరి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పట్టణం, మండల పరిధిలో బాణసంచా దుకాణాలను భీమవరం డీఎస్పీ జయసూర్య శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సీఐ జగదీశ్వరావు, ఎస్సై నాగబాబు ఆయన వెంట ఉన్నారు.

సామాన్యులపై భారం మోపొద్దు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంధన సర్దుబాటు రుసుముల పేరిట సామాన్యులపై భారం మోపితే ప్రతిఘటన తప్పదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో భీమవరంలోని విద్యుత్తు ఉప కేంద్రం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. కేంద్రం తెచ్చిన విద్యుత్తు సంస్కరణలతో ప్రజలపై అదనపు భారాలు పడుతున్నాయన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలవద్దని కోరారు. అనంతరం ఏఈ రవీంద్ర వర్మకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం కార్యవర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఏఈకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కార్మికులకు న్యాయం చేయండి

వీరవాసరం, న్యూస్‌టుడే: పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించి కార్మికులందరికీ న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంఘం మండల శాఖ సమావేశం డి.వరలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం వీరవాసరంలో జరిగింది. జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ భవన నిర్మాణ, రైసు మిల్లు, మత్స్యకారులు, కల్లుగీత, ఆటో, పంచాయతీ కార్మికుల వివరాలు కార్మిక శాఖలో నమోదయ్యాయని.. వాటి ఆధారంగా వారికి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి పి. నాగరత్నం మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆకివీడు, న్యూస్‌టుడే: విజయవాడ సమీపాన పామర్రు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకివీడు పరిధి మాదివాడ ప్రాంతానికి చెందిన బళ్ల వేణు వర్ధన్ (20) మృతి చెందారు. అదే ప్రాంతానికి చెందిన మహిళ దున్నల నాగపూర్ణిమకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు గురువారం ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళ్తుండగా పామర్రు వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వేణువర్ధన్ విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం రాత్రి మృతదేహాన్ని ఆకివీడుకు తీసుకువచ్చారు. నాగపూర్ణిమ చికిత్స పొందుతున్నారు.

'ప్రదర్శన అడ్డుకుంటాం'

గునుపూడి, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ కథా నాయకుడు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 23న బయటి వ్యక్తులు నిర్వహించ తలపెట్టిన సెలబ్రిటీ షోను అడ్డుకుంటామని ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉండి వాసు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందుతున్నామన్నారు. కొత్తగా ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తులు ప్రభాస్ పుట్టిన రోజున సెలబ్రిటీ షో పేరిట పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

KVB Karur Vysya Bank Smart way to bank

ఇ.నెం.22-15-91, ఎమ్ఆర్‌ఓ ఆఫీస్ ఎదురుగా, మెయిన్ రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534201. మొబైల్ నెం. 9959988581

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నందలి నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా **ఋణగ్రహీతలు మరియు హామీదారులకు** ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా **ఋణగ్రహీత : 1. శ్రీ కడియం రవి కిరణ్,** తండ్రి : కడియం అప్పారావు, డి.నెం.20-11-176, రెస్ట్ హౌస్ రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా - 534201. **హామీదారు మరియు టైటిల్ హోల్డర్ : 2. శ్రీ కడియం అప్పారావు,** తండ్రి : వెంకట సుబ్బారావు, డి.నెం.20-11-176, రెస్ట్ హౌస్ రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా - 534201. **హామీదారు : 3. శ్రీమతి కడియం లక్ష్మి నరసమ్మ,** భర్త : కడియం అప్పారావు, డి.నెం.20-11-176, రెస్ట్ హౌస్ రోడ్డు, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా - 534201 వారి నుండి రావల్సిన దిగువ తెలిపిన బకాయి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే లాంఛనంగా స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను **తేది.13-11-2024** న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అలానే ప్రాతిపదికన" విక్రయించబడును.

సౌకర్యం స్వభావం	ఖాతా నెంబరు	బకాయి మొత్తం	తదుపరి వడ్డీ తేదీ నుండి
Secured Over Draft	1431280000001778	తేది.30.09.2024 నాటికి రూ.1,20,25,068.72	01.10.2024
Working Capital Term Loan- GECL	1431808000000272	తేది.05.10.2024 నాటికి రూ.37,06,908.22	06.10.2024
	మొత్తం	రూ.1,57,31,976.94	

(అక్షరాల ఒక కోటి యాభై ఏడు లక్షల ముప్పై ఒక్క వేల తొమ్మిది వందల డెబ్బై ఆరు రూపాయల తొంభై నాలుగు పైసలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు:

షెడ్యూలు -ఎ1 : (శ్రీ కడియం రవి కిరణ్ గారి పేరున గల ఆస్తి): ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపాలిటీ, ఉండి రోడ్డు దగ్గర, టొయోటో ప్రో షో రూమ్ వెనుక, ఆర్.ఎస్.నెం.24/3 లోని 388.84 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం మరియు జిఐ షీట్ షెడ్ ఆస్తి. **హద్దులు : తూర్పు :** దక్షిణం నుండి ఉత్తరం వైపు పోవు ఈ నెంబర్‌లో గల 30 లింకుల వెడల్పు దారి - 94 లింకులు, **దక్షిణం :** ఎన్. లక్ష్మీపతి రాజు గారి భూమి - 111 లింకులు, **పడమర :** డి. మంగమ్మ గారి భూమి - 73 లింకులు, **ఉత్తరం:** వి.సుశీలమ్మ గారి భూమి - 109 లింకులు.

రిజర్వు ధర : రూ.97,00,000/-, ధరావత్తు : రూ.9,70,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-

షెడ్యూలు -ఎ2 : (శ్రీ కడియం అప్పారావు గారి పేరున గల ఆస్తి): ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపాలిటీ, ఉండి రోడ్డు దగ్గర, టొయోటో ప్రో షో రూమ్ వెనుక, డి.నెం.1-2-15 దగ్గర, ఆర్.ఎస్.నెం.24/3 లోని 300.00 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం మరియు జిఐ షీట్ షెడ్ ఆస్తి. **హద్దులు : తూర్పు :** కె. వి. సుబ్బారావు గారి భూమి - 86 లింకులు, **దక్షిణం :** రైల్ రోడ్డు - 135 లింకులు, **పడమర :** 30 లింకుల వెడల్పు దారి, **ఉత్తరం:** ఇదే నెంబర్ లోని భూమి.

రిజర్వు ధర : రూ.75,00,000/-, ధరావత్తు : రూ.7,50,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-

షెడ్యూలు -ఎ3: (శ్రీ కడియం అప్పారావు గారి పేరున గల ఆస్తి): ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మున్సిపాలిటీ, ఉండి రోడ్డు దగ్గర, టొయోటో ప్రో షో రూమ్ వెనుక, డి.నెం.1-2-15 దగ్గర, ఆర్.ఎస్.నెం.24/3 లోని 290.40 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం. **హద్దులు : తూర్పు :** కె. వి. సుబ్బారావు గారి భూమి - 58.1/2 లింకులు, **దక్షిణం :** పి. నాగేశ్వరి - 104 లింకులు, **పడమర :** 30 లింకుల వెడల్పు దారి - 58.1/2 లింకులు, **ఉత్తరం:** కె.వి. సుబ్బారావు గారి భూమి - 101 లింకులు.

రిజర్వు ధర : రూ.72,60,000/-, ధరావత్తు : రూ.7,26,000/-, బిడ్ పెంపుదల : రూ.50,000/-

గమనిక : ఋణగ్రహీత దాఖలు చేసిన SA No.48/2023 గౌరవనీయమైన డిఆర్‌టి విశాఖపట్నం ముందు పెండింగ్‌లో ఉన్నది.

అమ్మకం యొక్క వివరమైన నియమ నిబంధనల కొరకు బ్యాంక్/సెక్యూర్డ్ క్రెడిటార్ వారి వెబ్‌సైట్: **www.kvb.co.in/Property Under Auction** మరియు **M/s.4Closure (bankauctions.in)** హైదరాబాద్ వారి వెబ్ పోర్టల్ : **https:// www.bankauctions.in** చూడండి

SARFAESI చట్టం, 2002 యొక్క రూల్ 9(1) క్రింద 15 రోజుల చట్టబద్ధ ప్రకటన.

చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన బకాయిలను వేలం తేదీలోపు చెల్లించవలెనని, లేనిచో, షెడ్యూల్ ఆస్తి వేలం వేయబడుతుందని/విక్రయించబడుతుందని మరియు మిగిలిన బకాయిలు ఏవైన ఉన్నట్లయితే, వడ్డీ మరియు ఖర్చులతో పాటు వసూలు చేయబడతాయని ఋణగ్రహీత/లు మరియు గ్యారంటర్/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

తేది: 17-10-2024 అధీకృత అధికారి
స్థలం: భీమవరం ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

పూర్వ విద్యార్థుల స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి


సినిమా గోడపత్రం ఆవిష్కరణ

నరసాపురం, న్యూస్‌టుడే: వైఎన్ఎం పూర్వ విద్యార్థులు సాధించిన స్ఫూర్తిని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆ కళాశాల అధ్యాపకులు సూచించారు. కళాశాల పూర్వ విద్యార్థి ఉలి శెట్టి శ్రీనివాస్ హీరోగా నటించిన 'ఎంత పని చేశావ్ చంటి' సినిమా గోడ పత్రికను శుక్రవారం ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ తదితరులు ఆవిష్కరించారు. చంటి నటించిన తొలి చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ నెల 19న వైఎన్ఎంలో ఆడియో ఫంక్షన్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

స.హ. చట్టంపై అవగాహన

యలమంచిలి, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు మేడపాడు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. దీనిలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ దేవి మాట్లాడుతూ ప్రజా ప్రయోజనార్థం ఏదైనా సమాచారం కావాలంటే ప్రభుత్వ అధికారుల నుంచి దరఖాస్తు చేసి తీసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరు చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

'ఉపాధి' పనులపై గ్రామ సభ

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పని వేతనాలు వరం లాంటివని సర్పంచి సీహెచ్ గనిరాజు అన్నారు. సిద్ధాంతం గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ సభ నిర్వహించారు. 2025-26 సంవత్సరంలో పంట బోదెలు బాగు చేయడానికి 30 పనులు, కాలువల బాగు చేయడానికి 8 పనులు గుర్తించినట్లు తెలిపారు.

నరసాపురం, న్యూస్‌టుడే

సమస్య: మా ప్రాంతానికి నాలుగు రోజులుగా నీటి సరఫరా జరగడంలేదు. దీంతో మేము తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- నాడీ నరసింహస్వామి, ఇందిరా కాలనీ

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాను. - ఎం.అంజయ్య, పురపాలక కమిషనర్, నరసాపురం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక మసీదు సెంటర్‌లో వర్షం వచ్చినపుడు చెట్టు కొమ్మలు తగిలి విద్యుత్తు తీగలు రాజుకొని మంటలు వస్తున్నాయి. దీని కారణంగా విద్యుత్తు అంతరాయం అధికమవుతోంది. - దుర్గారావు, మసీదు సెంటర్

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - బాజీ, విద్యుత్తు ఏఈ, పాలకొల్లు

గజానికో గుంత.. పడితే చింత

అధ్వానంగా ప్రధాన రహదారులు

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే

ఎక్కువైనా రహదారులపై ప్రయాణం చేస్తారు. కానీ అయిదేళ్ల వైకాపా పాలన పుణ్యమా అని ప్రస్తుతం పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో గుంతకు గుంతకు నడుమ దారిని వెతుక్కుంటూ ముందుకు వెళ్లాల్సి వస్తోంది. గంటలో గమ్యం చేరాల్సిన చోట రెండు మూడు గంటల సమయం పడుతోంది. ఆ రోడ్డు ఈ రోడ్డు అనేమీ లేదు. ఏ వైపు చూసినా అధ్వాన రహదారులే దర్శనమిస్తున్నాయి. గుంతలను గుర్తించడానికి కర్రలు పాతి వాటికి జెండాలు తగిలిస్తున్నారు.

మోకాలి లోతున..

పాలకొల్లు నుంచి మార్టేరు వైపు నకు వెళ్లే ప్రధాన రహదారిలో పోడూరు మండలం జిన్నూరు దాటాక జగన్నాథపురం వరకు మోకాలి లోతున ఏర్పడిన గుంతలు రహదారికి మధ్యలో ఉన్నాయి. ఆయా గుంతల్లో పడి ఎందరో గాయాల పాలవుతున్నారు. చిన్న కార్లు వెళ్తుంటే కింద తగిలే పరిస్థితి నెలకొంది. పాలకొల్లు-నరసాపురం ప్రధానరహదారి ఇలానే తయారయ్యింది. పాలకొల్లు నుంచి దొడ్డిపట్ల వెళ్లే రహదారిలో అడవిపాలెం నుంచి మేడపాడు వరకు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకొల్లు యడ్ల బజారు నుంచి పెనుమదం మీదుగా ఆచంట వెళ్లే దారి దారుణంగా ఉండటంతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.


పాలకొల్లు - నరసాపురం దారి ఇలా..

నవంబర్ నుంచి..

సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు తయారు చేయాలని సీఎం చంద్రబాబు రహదారుల శాఖ అధికారులను ఆదేశించడం ఊరటగా నిలుస్తోంది. వచ్చే నవంబర్ నుంచి మరమ్మతులు చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా పనులు ప్రారంభించే అవకాశం కనబడుతోంది. దీనిపై రహదారులు భవనాల శాఖ ఏఈ ఎస్.ఎస్.ఎన్.మూర్తిని సంప్రదించగా నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున మరమ్మతుల నిమిత్తం మంజూరయ్యాయన్నారు. టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు.


అడవిపాలెం - మేడపాడు నడుమ..

ఆచంట ఐటీఐలో ఉద్యోగ ఎంపికలు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 22న ఉద్యోగ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పీవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీసుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. మార్కెటింగ్, సాంకేతిక రంగాల్లో ఉద్యోగ నియామకాలు ఉంటాయని, 18 నుంచి 28 ఏళ్ల మధ్య నిరుద్యోగులు అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

పురపాలక సంఘ డీఈగా ప్రవీణ్ చంద్ర

మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం పురపాలక సంఘ డీఈగా బాధ్యతలు స్వీకరించిన వి.ప్రవీణ్‌చంద్ర శుక్రవారం కమిషనర్ ఎం.అంజయ్య, ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇక్కడ పనిచేసిన ఆర్.రమేష్‌బాబు బదిలీపై విజయవాడ, ఆయన స్థానంలో ప్రవీణ్‌చంద్ర ఇక్కడకు వచ్చారు.


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈ ప్రవీణ్‌చంద్ర

పూడిక తొలగింపు

స్పందనకు సందేశం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పాత నవరసపురం రామాలయం వీధిలో సిమెంటు కాలువ మట్టితో పూడిపోయి, మురుగు నిలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ఈ నెల 17న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ స్పందించారు. కాలువలో మట్టిని తొలగించే పనులు సత్వరం చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం గోదావరికి వెళ్లే రహదారి మసీదు సమీపంలో చెత్త వేస్తున్నారు. గాలికి చెత్త ఎగిరి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని ఈ నెల 17న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి ఈ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.



ఈ చెట్టుకు ఎన్నేళ్లో చెప్పండి మర్రి..!

పాలకొల్లు, న్యూస్‌టుడే: భూమిలోకి కాలు నిలువెల్లా వేర్లలున్న ఈ మర్రి చెట్టు పాలకొల్లు మండలం లంకలకోడేరు ఉన్నత పాఠశాల మైదానంలో ఉంది. పైనుంచి కిందికి దిగజారుతున్న ఊడలు, కింది నుంచి పైవరకు ఎగబాకిన వేర్లతో చూడటానికి ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఈ చెట్టుకు వందేళ్ల చరిత్ర ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. చెట్టు కలకాలం చల్లని నీడను అందిస్తూ నేటి రోజుల్లో ఇంతటి వృక్షం ప్రముఖంగా నిలుస్తోంది.

సీపీఎం గ్రామ కార్యదర్శిగా శ్రీనివాసులు

పోడూరు, న్యూస్‌టుడే: మండలంలోని పెనుమదంలో సీపీఎం గ్రామ శాఖ మహాసభ కార్యక్రమం శుక్రవారం దొంగ చల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలు సమస్యలు గుర్తించి వాటిపై తీర్మానాలు చేశారు. అనంతరం శాఖ కార్యదర్శిగా కౌరు శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ తెలిపారు.

స్వర్ణకారుల సంక్షేమానికి కృషి

ఆకివీడు, న్యూస్‌టుడే: స్వర్ణకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని స్వర్ణకారుల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం స్వర్ణకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం లభించడం హర్షణీయమన్నారు. సంఘం ఆకివీడు శాఖ అధ్యక్షుడు పి.రామకృష్ణ, కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. విశాఖపట్టణం నగరం మద్దిలపాలేనికి చెందిన పట్నాల అనూష(32)కు పట్టణానికి చెందిన సరపల్ల ప్రవీణ్‌కుమార్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరు ప్రైవేటు పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు పాఠశాలలో ఇచ్చిన లీడర్‌షిప్ బ్యాగు పోగొట్టుకున్నాడు. దీనిపై భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై మనస్తాపం చెందిన అనూష ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై ఆమె తండ్రి పట్నాల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై..

మొగల్తూరు, న్యూస్‌టుడే: అదనపు కట్నం వేధింపులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కథనం మేరకు ముత్యాలపల్లికి చెందిన రేవతికి అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన కొపనాతి దుర్గాప్రసాద్‌తో ఏడాదిన్నర కిందట వివాహమైంది. కొంతకాలంగా భర్త, అతని ఏడుగురు బంధువులు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని రేవతి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జూద స్థావరంపై దాడి

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని పదో వార్డు స్వరాజ్య రామం వీధిలో ఒక దుకాణంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూద కేంద్రంపై శుక్రవారం దాడి చేశామని ఎస్సై ఎస్.ఎన్.ముత్యాలరావు తెలిపారు. ఈ దాడిలో ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

నట్టల నివారణ మందులు వేయాలి

నరసాపురం, న్యూస్‌టుడే: మేకలు, గొర్రెలకు తప్పనిసరిగా నట్టల నివారణ ఔషధాలు వేయించాలని పశువైద్యురాలు జి.నిహారిక సూచించారు. మండలంలోని రామన్నపాలెం, మొగల్తూరులో సుమారు 700 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆమె జీవాల పోషకులకు పలు సూచనలు చేశారు. శనివారం కాళీపట్నంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.



భూ సమస్యల పరిష్కారానికి చర్యలు: ఆర్డీవో

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే పూర్తైన గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల నుంచి భూ సంబంధిత లోటు పాట్లు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో దాసి రాజు అన్నారు. గొంది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. గ్రామ సభల్లో రైతుల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రీ సర్వే గ్రామాల్లో చేపట్టిన గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు 40పైగా భూ సమస్యలతో కూడిన అర్జీలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.రాజ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి.. పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకుని రీ సర్వేలో తప్పులను సరిదిద్దుకుని శాశ్వత పరిష్కారం పొందాలని తహసీల్దార్ వై.వి.దుర్గారావు అన్నారు. పాలకొల్లు మండలం బల్లిపాడులో శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. తప్పులను సరి చేసుకోవడానికి ఇది మంచి అవకాశమని తెలిపారు. గ్రామ సభలో సర్పంచి భూపతిరాజు అంజనీదేవి, వీఆర్వోలు అప్పారావు, నాగరాజు, సర్వేయర్ కె.జైలు పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో రెవెన్యూ సదస్సు.. యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణలో భాగంగా తొలి కార్యక్రమం బూరుగుపల్లిలో శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ అధ్యక్షతన ప్రారంభమైన సదస్సులో 14 అర్జీలు వచ్చాయి. సబ్ డివిజన్ నిమిత్తం 4, మ్యుటేషన్‌కు 6, విస్తీర్ణం సవరణకు 2, కొరికేషన్‌కు 1, ఆధార్ సవరణకు 1 రైతుల నుంచి వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. డీటీ దేవిప్రియ, ఆర్.ఐ. యశోద, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, రేఖపల్లి నాయుడు పాల్గొన్నారు.


నరసాపురం: రైతులతో మాట్లాడుతున్న దాసి రాజు

దరఖాస్తుల స్వీకరణ.. పోడూరు, న్యూస్‌టుడే: మినిమించిలిపాడు గ్రామంలో శుక్రవారం రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దారు సయ్యద్ మౌలానా ఫాజిల్ మాట్లాడుతూ రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం, ఇతర సమస్యలపై 18 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు.

శాశ్వత పరిష్కారం పొందాలి.. పెనుగొండ, న్యూస్‌టుడే: రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దుకుని శాశ్వత పరిష్కారం పొందాలని తహసీల్దార్ జి.అనితా కుమారి తెలిపారు. శుక్రవారం వెంకట్రామపురం, మునమర్రు పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన రీ సర్వే గ్రామ సభల్లో ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు సరి చేసుకోవడానికి చక్కని అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెంకట్రామపురంలో 8, మునమర్రులో 19 అర్జీలు వచ్చాయన్నారు.

కాగితాల్లో లెక్కలు కాదు.. భూములు అప్పగించండి

ఆచంట, న్యూస్‌టుడే

★ 'కాగితాల్లో సర్వే వల్ల ఉపయోగం లేదు.. పంట భూములు సరిహద్దుల్లో రాళ్లు వేసి రైతులకు అప్పగించాలి.' - ప్రవా వెంకటరమణారావు

★ 'ఎక్కడ బడితే అక్కడ పంట బోదెలు ఆక్రమణలకు గురయ్యాయి.. రోడ్ల పక్కన కొందరు పిల్ల కాలువలు, మురుగు బోదెలు ఆక్రమించి నిర్మాణాలు చేశారు.' - కానుమిల్లి జోగిరాజు

★ 'పంట బోదెల్లో రైతులు కప్పు కొడుతున్నాయి.. వాటికి నీరు, మురుగునీరు గొట్టాలు పంట బోదెల్లోకి పెట్టే శారు.' - నిమ్మకాయల నాగేశ్వరరావు

ఇలా రైతులు తమ గోడు వినిపించారు. శుక్రవారం ఆచంట మండలంలో రీ సర్వే పూర్తి చేసి, ఎల్పీ నెంబర్లు కేటాయించిన పెనుమంచిలిలో రైతుల నుంచి అర్జీలు కోరుతూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో అనేక మంది రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాలు, దస్త్రాలలో ఉన్న విస్తీర్ణం కంటే తక్కువ వస్తోందని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. 25 మంది పైగా అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి తహసీల్దార్ అర్జీలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు లేక పలువురు ఇబ్బంది ఏర్పడింది. రీ సర్వే డీటీ రాజేశ్వరి, సర్వేయర్ యోగేంద్ర కుమార్, వీఆర్వో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శునకాల స్వైర విహారంతో బెంబేలు



పలువురికి కుక్క కాట్లు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామాల ప్రజలు శునకాల బెడదతో బెంబేలెత్తుతున్నారు. ప్రతి వీధిలోను గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గురువారం సాయంత్రం మండలంలోని ఉల్లంపర్రుకు చెందిన బూసాల దుర్గ స్థానిక బ్రాడీపేట 5వ వీధిలోని ప్రజా కూరాయి వద్ద నీరు పట్టుకొని ఇంటికి తీసుకువెళ్తుండగా ఆ మార్గంలో వెళ్తున్న శునకం ఆమె కాలును పట్టుకొని ముక్కు వచ్చేలా గాయపరిచింది. టిడ్కో సముదాయంలో నివాసం ఉంటున్న బొజ్జ గోవర్ధన్ తన పని నిమిత్తం వెలమగూడెం మీదుగా వెళ్తుండగా ఓ కుక్క తన కాలుకు అడ్డుగా వస్తోందని దానిని కాపాడాలనే ఉద్దేశంతో కారుని ఆపి కుక్కను రక్షించాడు. ఆ కుక్క తిరిగి వచ్చి గోవర్ధన్ కాలిని కరిచి పారిపోయింది. వీరితో ఇద్దరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని టీకా వేయించుకున్నారు. అలాగే శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న ఒక బాలికను కూడా కరిచింది. ఈ నెల ప్రారంభం నుండి మొత్తం సుమారు 70 కుక్క కాటు టీకాలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.


బూసాల దుర్గ


★ కాలిపై కుక్క కాటు

బస్ షెల్టర్ లేక అవస్థలు


దొంగరావిపాలెం సెంటర్‌లో నిలువ నీడలేక నిల్చున్న ప్రయాణికులు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: దొంగరావిపాలెంలో జాతీయ రహదారి కూడలిలో బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా దొంగరావిపాలెం నుంచి తణుకు, ఏలూరు, విజయవాడ, రావులపాలెం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండ, వానకు నిలువ నీడ లేకుండా ఉంటుందని, కనీసం కూర్చోవడానికి సరైన వసతులు లేవని వాపోతున్నారు.

విద్యుత్తు అదనపు భారాన్ని రద్దు చేయాలి


పాలకొల్లు: నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్తు వినియోగదారులపై వేసిన అదనపు భారాన్ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే దిగుమర్తి రాజగోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్తు కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు శుక్రవారం కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో సతమతమవుతున్న ప్రజలపై విద్యుత్తు ఛార్జీ అదనపు భారం వేయడంతో మరింత భారం అవుతుందన్నారు. ఎంతో నమ్మకంతో కూటమికి అధికారమిస్తే ఇలాంటి చర్యలు చేపట్టి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, వై.అజయ్‌కుమార్, చల్లా సోమేశ్వరరావు, గంగరాజు పాల్గొన్నారు.

ఆచంట, న్యూస్‌టుడే: వినియోగదారులపై విద్యుత్తు భారం మోపే నిర్ణయం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోపాల్ అన్నారు. శుక్రవారం ఆచంటలో నిరసన తెలిపారు. ఎస్.నరసింహమూర్తి, ఎస్వీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం ఈ సంస్థ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు పూర్ణ, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. సాగునీరు పారేదెలా..

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: పంట భూములకు సాగునీరు అందించాల్సిన కాలువలు తూడు, గుర్రపుడెక్కతో పాటు వ్యర్థాలతో నిలయంగా మారాయి. దేవ పంట కాలువ, బోదెలు వ్యర్థాలతో నిండిపోవడంతో ఎక్కడికక్కడే పూడిపోయి నీటి పారుదల జరగడం లేదు.


దేవలో పూడిపోయిన పంట బోదె

మెప్మాపై పర్యవేక్షణ కరవు

మహిళా సంఘాలకు నిలిచిన శిక్షణ

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: గతంలో ఒక వెలుగు వెలిగిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యకలాపాలను గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా గాలికివదిలేసింది. ఆ విభాగం పర్యవేక్షణకు సమర్థులైన అధికారులను ఇవ్వకపోవడంతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం అంతంతమాత్రంగానే ఉండేది. పర్యవేక్షణ కరవడంతో స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, పర్యవేక్షణ పూర్తిగా ఆగిపోయింది. పట్టణంలో మహిళా సంఘాలు 1,657 ఉండగా 1,950 మంది యూనిట్లు స్థాపించారు.


శిక్షణ పొందుతున్న మహిళలు (పాత చిత్రం)

అయిదేళ్లుగా నీరసం

వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించక పోవడంతో కొత్త గ్రూపుల నిర్మాణం పూర్తిగా తగ్గిపోయింది. బ్యాంకు లింకేజీ రుణాలు పొందిన గ్రూపులను యూనిట్లు పెట్టించేందుకు ప్రోత్సహించాల్సి ఉండగా నిర్లక్ష్యం చేశారు. యూనిట్లు స్థాపించి ఉత్పత్తులు చేసినా వాటిని విక్రయించుకునేందుకు మెప్మా బజార్లు ఏర్పాటు చేయలేదు. ఆన్‌లైన్ మార్కెటింగ్ అవకాశం కల్పిస్తామని చెప్పిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలేవి చేయకపోవడంతో వల్ల సంఘాలలో అనాసక్తత పెరిగి ఉత్పత్తి తగ్గింది. పట్టణ జీవనోపాధి కేంద్రాలను పూర్తిగా నీరసపరిచారు. మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ అమలు చేయలేదు. స్వయం సహాయక సంఘాలను గాడిన పెట్టేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని మహిళలు కోరుకుంటున్నారు. ఇప్పటికే యూనిట్లు స్థాపించి వివిధ రకాల ఉత్పత్తులు చేస్తున్నవారిని పోత్సహించేందుకు మెప్మా బజార్లను నియోజకవర్గానికి కనీసం రెండైనా ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారులు మహిళా సంఘాల వారికి స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బలోపేతం చేస్తాం..

మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తాం. శిక్షణ తరగతులు నిర్వహించి ఆర్థిక పరిపుష్టికి ప్రోత్సాహిస్తాం. ప్రజాప్రతినిధుల సహకారంతో త్వరలో మెప్మా బజారు ఏర్పాటు చేస్తాం. - కె.రత్నాకర్, పట్టణ పేదరిక నిర్మూలనాధికారి, పాలకొల్లు

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక

కొమ్ముగూడెం, పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నేదునూరి కస్తూరి అండర్-17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి హిందూపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కస్తూరిని, వ్యాయామ ఉపాధ్యాయులు కొత్త సుభద్రలను సర్పంచి తాడేపల్లి బేబీ, ఎంపీటీసీ సభ్యుడు సూర్యని రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కాళ్ల మండలం కలవపూడి ఉన్నత పాఠశాల విద్యార్థిని వి.మోహన శ్రీలక్ష్మీ దుర్గ ఎంపికైంది. ఈ నెల 17న ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చూపి విజయనగరం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి (అండర్-14) వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రామోహనరావు తెలిపారు.

తుప్పలు, డొంకలు శుభ్రం

ఈనాడు స్పందన

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మల్లవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలో నిర్మించిన డ్వాక్రా భవనం చుట్టూ తుప్పలు, డొంకలు అలుముకుని మారింది. డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలు గ్రూపు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ఈ నెల 2న 'నిర్లక్ష్యం చెంత డ్వాక్రా భవనం' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ స్పందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామ కార్యదర్శి గంగాధరరావుకు సూచించారు. ఆయన పంచాయతీ సిబ్బందితో డ్వాక్రా భవనం చుట్టూ ఉన్న తుప్పలు, డొంకలు తొలగించి పరిష్కారం కావడంతో డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేశారు.



'ప్రదర్శనను అడ్డుకుంటాం'

గునుపూడి, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ కథా నాయకుడు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 23న బయటి వ్యక్తులు నిర్వహించ తలపెట్టిన సెలబ్రిటీ షోను అడ్డుకుంటామని ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉండి వాసు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందుతున్నామన్నారు. కొత్తగా ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తులు ప్రభాస్ పుట్టిన రోజు వేడుకల పేరిట సెలబ్రిటీ షోను పట్టణంలో నిర్వహించాలని పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సర్దుబాటు పేరుతో కరెంట్ ఛార్జీలు పెంచడం మానుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు తణుకు, ఇరగవరం మండలాల్లోని వేల్పూరు, ఇరగవరం విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. 2022-23లో వాడిన విద్యుత్తుకి ఇప్పుడు ప్రజలపై భారం మోపడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రంగారావు, కామన మునిస్వామి, వెంకటేశ్వరరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు తొలగించాలి


ప్రదర్శనలో వెంకటేశ్వరరావు, సిబ్బంది

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: దోమల ఉత్పత్తికి స్థావరాలైన నీటి నిల్వలు ఇంటి పరిసరాల్లో లేకుండా చర్యలు తీసుకోవాలని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని 5, 29 వార్డుల్లో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణవేణి, ఆరోగ్య సహాయకులు ఎం.శ్రీనివాస్, ఎన్.తాతాజీ, ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణకు శిబిరాలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ఆధార్ నవీకరణ కోసం అత్తిలి మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. 22, 23 తేదీల్లో అత్తిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బల్లిపాడు జడ్పీ, కంచుమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో, 24, 25 తేదీల్లో మంచిలి జడ్పీ, వరిఘేడు జడ్పీ, కొమ్మర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ నవీకరణ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సదరం కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న సదరం శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో ప్రత్యేక సదరం శిబిరం నిర్వహించారు. తొలి రోజు శిబిరంలో 20 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. శనివారం కూడా ఆసుపత్రి వద్ద శిబిరం కొనసాగుతుందన్నారు.

ఆందోళనలో అన్నదాత

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:

కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులు అన్నదాతల్లో గుబులు పుట్టిస్తున్నాయి. పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని బెంబేలెత్తిపోతున్నారు. మరో పక్క తెగుళ్ల వ్యాప్తి చెందుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. పంట చేతికొచ్చిన ప్రతిసారి ఏదోక రూపంలో నష్టపోతున్నామని వాపోతున్నారు.

పట్టించుకోని వ్యవసాయాధికారులు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పంట పొలాల్లో నత్రజని పెరిపోతుంది. దీంతో ఆకు ఎండు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. దీనికి తోడు శిలీంద్రాల్లో మాగుడు విజృంభిస్తుంది. అయితే ఆకు ఎండు తెగులుకు మందు లేకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. దీని ప్రభావం 40 శాతం పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి సూచనలు సలహాలు ఇవ్వాలని మండపాక రైతులు కోరుతున్నారు.

పొంచి ఉన్న తెగుళ్ల ముప్పు

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
తణుకు	11197	6700
ఇరగవరం	13108	7500
అత్తిలి	11780	9700

ఇదీ పరిస్థితి

తణుకు నియోజకవర్గంలో 36,085 ఎకరాల్లో 21,080 మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటంతా ఈనిక దశలో ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో జులై నెలలో వరదలకు వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. దీంతో పలువురు కొత్తగా మళ్లీ నాట్లు వేశారు. మరికొందరు పంటను ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసి రక్షించుకున్నారు. ఈ దశలో కొన్నిరోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గాలులు వీస్తున్నాయి. దాంతో పంట నేలవాలే, తెగుళ్ల వ్యాప్తిచెందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలు పైగా రైతులు పెట్టుబడి పెట్టారు.


ఈనిక దశలో ఉన్న పంట చేను

మరి కొందరు కౌలుకు మరో రూ.20 వేలు అదనంగా చెల్లించారు. ఈ సమయంలో పంటలు దెబ్బతింటే రైతులకు భారీ నష్టం చేకూరే అవకాశం ఉంది. గతేడాది ఖరీఫ్, రబీ సాగు సమయంలో అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. వరదల కారణంగా ఈ ప్రాంతంలో వయ్యేరు గట్టు బలహీనంగా ఉన్న చోట నుంచి పొలాల్లోకి నీరు చేరి ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాల కారణంగా పొలాల్లోకి చేరిన నీరు బయటకు వెళ్లే మార్గం ఏర్పాటు చేయాలి. ఆకు ఎండు తెగులు వ్యాధి వచ్చినప్పుడు యూరియా పిచికారీ చేయకూడదు. తగు జాగ్రత్తలు పాటించాలి.
- ఎంపీ రమేశ్, సహాయ వ్యవసాయ సంచాలకుడు

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు గ్రామీణ	: 85558 50851
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెంలో హౌసింగ్‌బోర్డు నుంచి శశి కళాశాల వెళ్లే మార్గం చివరలో రహదారిపై మురుగు చేరి చిత్తడిగా మారుతోంది.
- చందు, స్థానికుడు

సమాధానం: పరిశీలించి రహదారిలో మురుగు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం
- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య: తాడేపల్లిగూడెంలోని సీతారామపేటలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు మొలిచి విషపురుగులకు నిలయంగా మారాయి.
- శ్రీను, స్థానికుడు

సమాధానం: పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు చేపడతాం
- ఏసుబాబు, పురపాలక కమిషనర్

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య: పెంటపాడు మూలాపేటలోని ఆజాది రెండు వీధుల్లోని మురుగు బోదెలు వ్యర్థాలతో పూడుకుపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లే మార్గంలేక రహదారిపైకి చేరుతోంది. - రమేష్, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో త్వరితగతిన మురుగు బోదెలోని పూడిక తొలగిస్తాం. - గోడి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి

సమస్య: పెంటపాడు మండలం రావిపాడులోని పంటకాలువ సమీపంలో రహదారి వెంబడి చెత్తాచెదారం వేయడంతో పేరుకుపోయాయి. పంచాయతీవారు వాటిని తొలగించకుండా నిప్పంటిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దట్టంగా పొగ అలముకుని రాకపోకలు చేస్తున్న వాహన చోదకులు, సమీప నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు.
- సత్యనారాయణ, గ్రామస్థుడు

సమాధానం: ఇకపై చెత్తకు నిప్పంటించకుండా చర్యలు తీసుకుంటాం. చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తాం.
- పెన్నాడ సూర్యనారాయణ, సర్పంచి

ఈనాడు స్పందన

చెత్త తొలగింపు.. **పెంటపాడు, న్యూస్‌టుడే:** పెంటపాడు డంపింగ్‌యార్డుకు వెళ్లే మార్గం వ్యర్థాలు, చెత్తతో నిండిపోయింది. దీంతో గ్రామంలో సేకరించిన చెత్తను పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది రహదారిలోనే పడేస్తున్నారు. అంత్యక్రియల నిమిత్తం శ్మశానానికి వచ్చేవారు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనిపై 'ఎక్కడికక్కడ చెత్త మేటలు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోడి బాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జేసీబీ సాయంతో డంపింగ్‌యార్డు వెళ్లే మార్గం, శ్మశానంలో వేసిన చెత్త, వ్యర్థాలను తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. చెత్తను నేరుగా డంపింగ్ యార్డులోనే వేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ ప్రసాద్ తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ


బలుసులమ్మ


కొండాలమ్మ

సాయిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణ పురదేవత బలుసులు అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. ఈ క్రతువులో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు ప్రదీప్ శర్మ అందించిన తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. ★ నిట్ సమీపంలోని కొండాలమ్మ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

అయ్యప్పకు విశేష అభిషేకాలు



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి రైల్వే స్టేషనుకు వెళ్లే మార్గంలో అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారిని అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు రకరకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తాం


పడమరవిప్పర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే : ప్రణాళికాబద్ధంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన పెంటపాడు మండలం పడమరవిప్పర్రులో జరిగిన పల్లెపండగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టామని, కొద్దిరోజుల్లో రూ.1.40 కోట్లతో గ్రామం నుంచి కస్పాపెంటపాడు, గణపవరం రహదారులను అనుసంధానిస్తామన్నారు. నాయకులు గ్రామ తగాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచి తెంటు జయలక్ష్మి, ఎన్డీయే నాయకులు గంటా సుబ్రహ్మణ్యం, పసల అచ్యుతం, పసుపులేటి అమ్మిరాజు, కొండ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ★ తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్లలో పల్లె పండగ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అభివృద్ధి విషయంలో ప్రజలందరూ ఎన్డీయే ప్రభుత్వానికి సహకరించి, అవినీతి విషయంలో నిలదీయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



పీడీఎఫ్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపి మూర్తి శుక్రవారం తణుకు పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.జయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మండల కమిటీ అధ్యక్షుడు రంగారావు, ప్రధాన కార్యదర్శి రవి, గౌరవ అధ్యక్షుడు దేవదత్తం, సహ అధ్యక్షుడు సరేష్, కోశాధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భారంగా నిత్యావసరాల ధరలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరల కారణంగా సామాన్య ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక


కస్తూరిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు

కొమ్ముగూడెం, పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నేదునూరి కస్తూరి అండర్-17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి హిందూపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కస్తూరి, వ్యాయామ ఉపాధ్యాయురాలు కొత్త సుభద్రలను సర్పంచి తాడేపల్లి బేబి, ఎంపీటీసీ సభ్యుడు సూర్పని రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

విరిసిన ప్రతిభ


విజేతలతో పాఠశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు

'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని మహాత్మాగాంధీ పురపాలకోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'చరవాణి వినియోగం వల్ల లాభాలు- నష్టాలు, మీకు ఎదురైన అనుభవాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విశేష సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎం.జ్యోతి ప్రదీప్, వై.రాజేష్, ఎం.అక్షిత నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయిని ధనలక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చింతకాయల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను రద్దు చేయాలని కొమ్ముగూడెంలో అధికారులకు రైతులు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా టైట్లింగ్ యాక్టుతో పాటు లోపభూయిష్టమైన రీ సర్వేను కూడా రద్దు చేయాలని కోరారు.


అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కొమ్ముగూడెం రైతులు

భద్రతే శ్రీరామ రక్ష


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: వాహనదారులు ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించి రహదారి ప్రమాదాలను నివారించాలని ఇన్‌స్పెక్టర్ ఆర్ బెన్ని రాజు కోరారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా తణుకు ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం వాహనదారులకు భద్రతా ప్రమాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం తప్పకుండా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకులు తప్పకుండా శిరస్త్రాణం ధరించాలని ట్రాఫిక్ ఎస్సై కొండలరావు అన్నారు. స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీసర్వే లోపాలు సరిచేసేందుకే గ్రామ సభలు


దరఖాస్తులు పరిశీలిస్తున్న మండల అధికారులు

తణుకు గ్రామీణం, అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే: భూ రీసర్వేలో లోపాలను సరిచేసేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ కోరారు. శుక్రవారం మండలంలోని కోనాలలో నిర్వహించిన భూ రీసర్వే గ్రామ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా 63 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కె.నాగభూషణం, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పి.గౌతమి, మండల సర్వేయర్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ★ అత్తిలి మండలం పాలిలో తహసీల్దార్ దశిక వంశీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. మొత్తం 23 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శామ్యూల్, ఈవోపీఆర్డీ శ్రీనివాసు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్లీపర్ సర్వీసులు, తణుకు నుంచి తిరుపతి, విజయవాడ, భద్రాచలం సర్వీసులపై తమ సూచనలు తెలియజేయాలని కోరారు. డిపో పరిసర ప్రాంత ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు సలహాలు సూచనలు ఇచ్చేందుకు చరవాణి నం. 99592 25484ను సంప్రదించాలన్నారు.

నట్టల నివారణతో మేలు

జగ్గన్నపేట (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటలో శుక్రవారం 148 గొర్రెలు, 52 మేకలకు నట్టల నివారణ మందులు వేశామని మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ సర్పంచి ములకాల సూర్యారావు, పశు సంవర్ధక సహాయకుడు చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.


యువకుడి ఆత్మహత్య

వెంకట్రామన్నగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామీణ ఎస్ఐ జేవీఎన్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం గ్రామానికి చెందిన చినిమిల్లి సునీల్(26) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు అవివాహితుడు . అతని తండ్రి అన్నవరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం, అప్పారావుపేట, జగన్నాథపురం, నందమూరు, నవాబ్‌పాలెం, కొత్తూరు, ఆరుగొలను, కృష్ణాయపాలెం సచివాలయాల వద్ద శుక్రవారం బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సిబ్బంది నిర్వహించారు. * తణుకు పట్టణంలోని ముత్యాలవారి వీధి కేంద్రం, నం.1, 2 ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.


జగన్నాథపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, స్థానికులు


తణుకు: ముత్యాల వీధిలో ప్రదర్శనలో చిన్నారులు, తల్లిదండ్రులు